క్లుప్తంగా

రహదారులపై ఆక్రమణలు తొలగించాలి


సూచనలు చేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో రహదారులపై ఆక్రమణలను తొలగించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ కూడలి, అశోక్ నగర్, నరసింహారెడ్డి నగర్, సంకల్‌బాగ్, కాలనీలలో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్ వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. అనధికారిక దుకాణాలు, రహదారుల వద్ద అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వాణిజ్య దుకాణాల వద్ద యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. చెత్త చెదారాన్ని మురుగు కాల్వల్లో వేయవద్దని సూచించారు. పారిశుద్ధ్య తనిఖీదారులు మునిస్వామి, షేక్షావలి పాల్గొన్నారు.

కళాకారులకు ప్రోత్సాహం


కళాకారులకు చెక్ అందజేస్తున్న కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్: స్థానిక కళాకారులకు ప్రోత్సాహమిస్తామని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం నెలవారీ పౌరాణిక నాటక ప్రదర్శనలో భాగంగా కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ వ్యవస్థాపకులు మనోహర్‌బాబు ఆధ్వర్యంలో ఉచిత పౌరాణిక నాటకాల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఓబులయ్య మాట్లాడుతూ.. స్థానిక కళాకారులు పూర్తి నాటకాన్ని ప్రదర్శిస్తే రూ.30 వేలు, అంకాలు ప్రదర్శిస్తే రూ.15 వేలు ఇచ్చేందుకు కళాక్షేత్రం పెద్దలు నిర్ణయం తీసుకున్నారన్నారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన భవాని నాటకంలోని చింతామని, సత్య హరిశ్చంద్ర నాటకంలోని సన్నివేశాలు అలరించాయి. కళావాహిని సంస్థ వారికి టీజీవీ కళాక్షేత్రం తరఫున రూ.10 వేల పారితోషికాన్ని అందజేశారు. సంస్థ మాజీ అధ్యక్షుడు దస్తగిరి, సభ్యులు శ్రీనివాసరెడ్డి, కదిరి రమేష్, శ్రీధర్, కృష్ణకుమారి, వెంకటేశ్వర్లు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కోల్స్ చర్చిలో నేడు క్యాండిల్ లైటింగ్ సర్వీస్

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న కోల్స్ సెంటినియల్ తెలుగు బాప్టిస్టు సంఘంలో సోమవారం సాయంత్రం క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘ కాపరి రెవరెండ్ జీవన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీస్తు జన్మదినం పురస్కరించుకొని క్రిస్మస్ పాటలు, క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన ఎక్‌లేషియా బాప్టిస్టు ఫెలోషిప్ దైవ సందేశకులు రెవరెండ్ గ్లాడ్సన్ రామపోగు దేవుని సందేశం ఇస్తారని, క్రైస్తవులు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు పొందాలన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కర్నూలు (టౌన్): స్థానిక డాన్ బాస్కో హోమ్‌లోని నిరాశ్రయ పిల్లల ఆశ్రమంలో ఆదివారం ఎవాంజికలికల్ సపోర్టింగ్ టీమ్ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించింది. కేక్ కట్ చేసి క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ ప్రతినిధులు సుధీర్, సురేష్, భాను, రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త పౌర్ణమి

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆదివారం దత్త పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. పండితులు మామిళ్లపల్లి రాజేశ్ శర్మ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం రాజశ్యామల అమ్మవారికి హోమం నిర్వహించారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం

కర్నూలు(రూరల్): మండల పరిధిలో గార్గేయపురం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చిన భక్తులు స్వామివారి రథోత్సవాన్ని తిలకించారు. ప్రతి ఏటా మృగశిర నక్షత్రం మఘుపౌర్ణమి రోజు నస్వామివారి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులతో గార్గేయపురం నిండిపోయింది.

ధనుర్మాసం.. పుణ్య ఫలం

- నేటి నుంచి ధనుర్మాసం ప్రారంభం
- శివకేశవులకు ప్రియమైన మాసం
- వైష్ణవాలయాల్లో శ్రీరంగనాథునికి ప్రత్యేక సేవలు
- ప్రాతఃకాల పూజలు.. బాల భోగాలు
- రోజుకొక తిరుప్పావై పాశుర పఠనాలు




కర్నూలు శివారులోని గోదాగోకుల ఆలయం, ఆలయంలో గోదాదేవి, రంగనాథ స్వామివారు

కర్నూలు కల్చరల్: ధనుర్మాసంలో ఆచరించే పూజలు, వ్రతాలు, ఉపవాసాలు సకల శుభాలను కలుగజేస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. మాసానాం.. మార్గ శీర్షోహం.. మార్గశిరం తనకు ఇష్టమైందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు స్వయంగా అర్జునుడికి చెబుతాడు. శ్రీ మహావిష్ణువుకు ఈ మాసమంటే మహా ప్రీతి. మార్గశిరంలోనే ధనుర్మాసం కలిసి వస్తుంది. ఆధ్యాత్మిక చింతన, మధుర భక్తికి ప్రతీకగా ధనుర్మాసం నిలుస్తోంది. సంప్రదాయంగా మనం అనుసరించే మాసాల్లో ధనుర్మాసం ఒకటి. ఇది దక్షిణాయనానికి చివరిలోనూ, ఉత్తరాయణానికి ప్రారంభంలో వచ్చే పవిత్ర మాసమిది. సూర్యుడు ధనస్సు రాశిలోకి ప్రవేశించే సమయాన్ని ధనుస్సంక్రమణం అంటారు. ఈ రోజు నుంచి మకర రాశిలోకి ప్రవేశించే వరకు ఉన్న నెల రోజుల కాలమే ధనుర్మాసం. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది. శివకేశవులకు ప్రీతిపాత్రమైన ఈ మాసంలో జిల్లాలోని వైష్ణవాలయాల్లో 30 రోజుల పాటు శ్రీరంగనాథునికి ప్రత్యేక సేవలు, ప్రాతఃకాల పూజలు.. బాల భోగాలు, వేకువజామునే రోజుకొక తిరుప్పావై పాశుర పఠనాలు నిర్వహించనున్నారు.

మధుర భక్తికి ప్రతీక గోదా దేవి..

మార్గశిర మాస వేదాంత కన్యగా పేరుపొందిన గోదాదేవి, ఆముక్తమాల్యద ఇద్దరూ ఒక్కరే. పురాణ కథనం ప్రకారం గోదావేవి విషయంలోకి వస్తే.. తండ్రి విష్ణుచిత్తుడు స్వామికి పూలమాలలు కైంకర్యం చేసే సేవలో గోదాదేవి సహాయకారిగా ఉండేది. పూల మాలలను ఆలయానికి తీసుకెళ్లే ముందు తాను ముందుగా వాటిని ధరించి మురిసిపోతుండేది. ఆ తరవాత వాటిని పూలబుట్టలో పెట్టేది. ఒక రోజు నిజం తెలుసుకున్న విష్ణుచిత్తుడు అపచారమంటూ కూతురిని మందలించగా ఆ పూలమాలలే తనకు ఇష్టమంటూ స్వామి ప్రీతితో స్వీకరించాడు. వయసు వచ్చిన గోదాదేవి శ్రీ మహావిష్ణువైన రంగనాథుడినే వివాహమాడాలనుకుని ధనుర్మాసం నెల రోజులు రోజుకు ఒకటి చొప్పున పాశురం ఆలపిస్తూ ఉండేది. దీక్షతో ఆమె ముప్పై పాశురాలను ఆలపించిన అనంతరం శ్రీరంగనాథుడు గోదాదేవిని తనలో లీనం చేసుకున్నాడు. మధుర భక్తికి ప్రతీకగా నిలిచే పాశురాల్లో గొప్ప వేదాంత అర్థం ఇమిడి ఉంది. ఈ ధనుర్మాసంలోనే గోపికలు కృష్ణ పరమాత్ముడిని స్తుతిస్తూ తమ మధురభక్తిని చాటుకునే వారు. యువతులు ఈ మాసంలో కాత్యాయనీ వ్రతాలను ఆచరిస్తారు. వాటిని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే మనసుకు నచ్చిన మంచి భర్త లభిస్తాడనే నమ్మకం ఉంది.

గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబం..

ధనుర్మాసంలో సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడంతో వచ్చే మకర సంక్రమణం (సంక్రాంతి) అంతం అవుతుంది. ఈ ధనుర్మాసం రోజుల్లో ప్రతి ఇంటిముందు తెల్లవారుజామునే గోమయంతో కళ్లాపి జల్లి రంగురంగుల ముగ్గులు వేసి వాటిపై ఆవుపేడతో చేసిన గొబ్బిళ్లను ఉంచి వాటిని గుమ్మడి, బంతి పూలతో అలంకరిస్తారు. ఇంటిముందు లోగిళ్లలో అలంకరించిన ఈ రంగవల్లులు, గొబ్బిళ్లు లక్ష్మీదేవికి స్వాగతం పలుకుతాయనే విశ్వాసం, ఆచారం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా వివిధ జానపద కళాకారులు, హరిదాసులు, బుడబుక్కల, గంగిరెద్దుల, పగటి వేషగాళ్లు ఆయా వేషధారణలతో కీర్తనలు ఆలపిస్తూ విన్యాసాలు చేస్తూ వీధుల్లో సంచరిస్తారు. ఈ మాసంలో రంగనాథునితో పాటు సకల దేవతలకు పూజలు చేస్తే భక్తుల అభీష్టాలు నెరవేరుతాయనే విశ్వాసం ఉంది.

జిల్లా కేంద్రంలో ఇలా..

ధనుర్మాసం 30 రోజుల పాటు నగర శివారు మాసమసీదు సమీపంలోని గోదాగోకులం, కృష్ణానగర్‌లోని శ్రీనివాస మందిరం, సీక్యాంప్‌లోని విజ్ఞాన మందిరం, దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం, రంగరాజు వీధిలోని మాలెబాలె సత్రం, సంకల్‌బాగ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, వెంకటరమణ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం తదితర వైష్ణవాలయాల్లో ప్రాతఃకాల పూజలు, అనంతరం తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి బాలభోగం చేపడతారు.

గోదా గోకులంలో విశేష సేవలు

22వ తేదీ అమ్మవారికి సారె సమర్పణ, 28న పుష్పయాగం, జనవరి 2న తిరుప్పావడ సేవ, 3న దీపాలంకరణ, 9న రేపల్లె వేడకలు, 10న వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, 11న కూడారై సేవ, 13న గోదా రంగనాథుల లఘు కల్యాణం, 17న శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథులకు తిరుమంజనం, 19న «నిత్య కల్యాణం – పచ్చతోరణం» కార్యక్రమం ప్రారంభం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విష్ణువుకు ప్రియమైన మాసం



విష్ణువుకు ప్రియమైనది ధనుర్మాసం. ఈ మాసంలో స్వామివారికి చేసే చిన్నపాటి పూజాది క్రతువైనా అక్షయ, అమోఘ సత్ఫలితాలను ప్రసాదిస్తుంది. ఈ నెల రోజులు వైష్ణవాలయాల్లో తెల్లవారుజామునే సూర్యోదయానికి పూర్వమే పూజలు జరుగుతాయి. రోజూ తిరుప్పావై పాశురాలు పఠనం చేస్తారు. ప్రాతఃకాల పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకొని పాశురాలు పఠనం చేసినా, విన్నా భక్తుల అభీష్టాలు నెరవేరుతాయి. శ్రీనివాస మందిరంలో జనవరి 10వ తేదీ ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం, 13వ తేదీ శ్రీ గోదా దేవి కల్యాణోత్సవం నిర్వహించనున్నాం.

– కృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు, కృష్ణానగర్ శ్రీనివాస మందిరం

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ధ్యానంతో జీవనంలో మార్పు

కర్నూలు కల్చరల్: ధ్యానం, జ్ఞానంతో మనిషి జీవన విధానంలో మార్పు వస్తుందని సంత్ సదానంద గిరి మహారాజ అన్నారు. ఆదివారం రాఘవేంద్ర నగర్‌లోని పిరమిడ్ ధ్యాన కేంద్రానికి వచ్చిన రుద్ర ప్రయాగ పీఠాధిపతి సంత్ సదానంద గిరి మహరాజును ఘనంగా సన్మానించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. సదానంద గిరి మహరాజ ధ్యానంతో జ్ఞానం పొంది జీవితాన్ని సుఖమయం చేసుకుంటూ 109 వసంతాలు పూర్తి చేసుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి, టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, జీఎస్టీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడారు. సినీ నిర్మాత సత్యారెడ్డి, పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ధర్నా

కర్నూలు(సెంట్రల్): పీఎం విశ్వకర్మ కౌసల్య యోజన పథకం లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టనున్నట్లు ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ధర్నా కార్యక్రమంలో అధిక సంఖ్యలో లబ్ధిదారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా లబ్ధిదారులకు వెంటనే రుణాలను మంజూరు చేయాలని, శిక్షణ పొందిన వారికి అలవెన్స్‌ను విడుదల చేయాలన్న రెండు డిమాండ్లతో ధర్నాకు పిలుపునిచ్చినట్లు ఆయన వెల్లడించారు.

ప్రజాగళాన్ని అణచివేయడం తగదు

కర్నూలు(సెంట్రల్): సమాజంలో పౌరుల వాక్ స్వాతంత్రపు హక్కులను కాలరాస్తున్నారని, ప్రజావాణిని వినిపిస్తే అణచివేసేందుకు ప్రభుత్వాలు పూనుకోవడం ఆందోళనకరమని సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం అధ్యక్షుడు ఓంకార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో «నేటి సమాజంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ» అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీడీఆర్ఎస్ అధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ.. కవులు, కళాకారులు, ప్రజాస్వామ్యవాదులపై కేసులు నమోదవుతుండడం ఆందోళనకరమన్నారు. వాక్ స్వాతంత్రాన్ని పూర్తిగా అణచి వేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. పౌరుడిగా ఏది సరైనది..ఏది కాదు అని చెప్పే స్వేచ్ఛ ఉండాలన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సామాన్య ప్రజానికానికి న్యాయం జరగాలని, ఇందుకోసం పటిష్టమైన న్యాయ వ్యవస్థ ఉండాలాన్నరు. హెడ్‌మాస్టర్ వెంకటరెడ్డి, ఆల్‌ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పౌర చైతన్య వేదిక బాధ్యుడు ఎస్.గోవిందరాజులు మాట్లాడారు.

సీపీడీఆర్ఎస్ నూతన కమిటీ

రౌండ్ టేబుల్ సమావేశం చివర్లో సీపీడీఆర్ఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బార్ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షుడు ఓంకార్, కార్యదర్శిగా తేజోవతి, కోశాధికారిగా జహీర్, గౌరవాధ్యక్షుడిగా పత్తి ఓబులయ్య, గౌరవ సలహాదారులుగా ఎల్లారెడ్డి, వెంకటరెడ్డి, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ రామశేషయ్య, రిటైర్డ్ లీగల్ ఆఫీసర్ జనార్దన్, సీనియర్ న్యాయవాది ఎంఆర్ కృష్ణతోపాటు మరో 31 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.


సమావేశమైన సీపీడీఆర్ఎస్ కమిటీ సభ్యులు

కార్మికులకు యూనిఫాం పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల వ్యర్థాలను సేకరించి డంప్‌యార్డ్‌కు తరలించే నగర పాలక డ్రైవర్లు, లోడర్లు, ఇతర సిబ్బందికి కమిషనర్ రవీంద్రబాబు చేతుల మీదుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక పార్థసారథి నగర్‌లోని ఐఎంఏ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. ప్రైవేటు ఆసుపత్రులు స్వచ్ఛందంగా వాహనాలు, సిబ్బందిని ఏర్పాటు చేసి, వాటి ఖర్చును భరించడంతో పాటు సిబ్బంది అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఐఎంఏ సభ్యులు మాట్లాడుతూ కమిషనర్‌తో పాటు ఆరోగ్యాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి తమకు ఎలాంటి సమస్యలు లేకుండా, వ్యర్థాల తరలింపునకు పూర్తిగా సహకరిస్తున్నారని చెప్పారు. ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామచంద్రనాయుడు, డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, డాక్టర్ శివశంకర్ రెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.


కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు, ఐఎంఏ సభ్యులు

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలో వివిధ ప్రాంతాల్లో రహదారులపై నిద్రిస్తున్న అభాగ్యులకు అజ్వా వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు శనివారం అర్ధరాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నగరంలోని వన్‌టౌన్, పెద్దపార్కు, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కొత్తబస్టాండ్, రైల్వే స్టేషన్, బళ్లారి చౌరస్తా తదితర ప్రాంతాలు తిరిగి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభాగ్యులు చలిగాలులకు ఇబ్బంది పడుతూ అనారోగ్యానికి గురి గాకుండా దుప్పట్లు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. సొసైటీ ప్రెసిడెంట్ సాజిద్ ఖాన్, సభ్యులు యాసిర్, సమీర్, వీరేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లతో నిర్వాహకులు

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కర్నూలు కల్చరల్: పాతబస్టాండ్‌కు చెందిన రేణుక బంగారు గొలుసు చోరీకి గురైంది. సురేష్, రేణుక దంపతులు కర్నూలు నుంచి అయిజ వెళ్లేందుకు బస్సు ఎక్కారు. రేణుక మెడలోని ఐదున్నర తులాల బంగారు గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించారు. నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘క్లాట్’లో మెరిసిన ఆణిముత్యం


ర్యాంకర్ మేఘవర్ధన్ రెడ్డిని అభినందిస్తున్న శ్రీసాయిక్రిష్ణ డిగ్రీ కాలేజీ యాజమాన్యం

కర్నూలు సిటీ: జాతీయస్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం కోసం కన్సార్టియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్ నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్–2025 (క్లాట్)లో కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థి జాతీయస్థాయిలో సత్తాచాటారు. ఈ సందర్భంగా శ్రీసాయిక్రిష్ణ డిగ్రీ కాలేజీలో ఆదివారం అభినందన కార్యక్రమం జరిగింది. కాలేజీ అధినేత పి.గోవర్ధన్ రెడ్డి, సతీమణి మీనా పాల్గొని క్లాట్‌లో ర్యాంకు సాధించిన కె.మేఘవర్ధన్ రెడ్డిని అభినందించారు. తమ విద్యాసంస్థల డైరెక్టర్ కె.రోసిరెడ్డి, పరిమళ దంపతుల కుమారుడు కె.మేఘవర్ధన్ రెడ్డి జాతీయ స్థాయిలో 447వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ర్యాంకర్ మేఘవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ చదువుతున్న సమయం నుంచి రోజూ 4 గంటలు క్లాట్ పరీక్ష కోసం సన్నద్ధం అయ్యానని, రోజూ దినపత్రికలు చదవడంతో పాటు పాత పశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడంతోనే ర్యాంకు సాధించగలిగానన్నారు.

సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలి

కర్నూలు కల్చరల్: పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో భగరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సంబంధాలు బాగుండాలన్నా, ఉత్తమ సమాజం నిర్మితం కావాలన్నా నైతికతను పెంపొందించాలన్నారు. ఇవన్నీ భగవద్గీత పఠనం, శ్రవణంతోనే సాధ్యమవుతాయన్నారు. అనంతరం హరే రామ.. హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


సందేశమిస్తున్న రఘునందన సేవక ప్రభు

మూడు దుకాణాల్లో చోరీ

కోడుమూరు రూరల్: కోడుమూరులోని కర్నూలు రోడ్డులో ఉన్న మూడు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి అనంతరం తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం యథావిధిగా దుకాణాలను తెరిచేందుకు వచ్చిన దుకాణదారులు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి కోడుమూరు పోలీసులను ఆశ్రయించారు. శివసాయి ట్రాక్టర్ స్పేర్స్ దుకాణంలో రూ.25వేలు, టీ దుకాణంలో రూ. వెయ్యికి పైగా విలువ సిగరెట్ పాకెట్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎస్ఐ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు


భక్తిగీతాలు పాడుతున్న చిన్నారులు


మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

కల్లూరు: కర్నూలు నగరంలోని శకుంతల కల్యాణ మండపం సమీపాన సీఎస్ఐ చర్చిలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి క్రీస్తు మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. అనంతరం బెంగుళూరుకు రెవ. జి.చంద్రశేఖర్ కరుణానాయుడు యేసుక్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. క్రీస్తు జననంపై చిన్నారులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రబాబు, ఐజక్ ప్రసన్నకుమార్, జాన్సన్, విజయకుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, క్రైస్తవులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

కర్నూలు కల్చరల్: క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని డీఈఓ శామ్యూల్ పాల్ అన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ.. యేసు క్రీస్తు ప్రపంచ మానవాళికి ప్రేమ, దయ, కరుణ, శాంతి చాటారన్నారు. పాస్టర్ రాజేష్, ఎస్టీయూ పూర్వ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్దన్ మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


జెడ్పీలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఈఓ, ఉద్యోగులు


నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

కర్నూలు(అర్బన్): ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయమని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. తెలుగు భాష మాట్లాడే వారందరికీ ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే డిమాండ్‌తో పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించి పెట్టారన్నారు. అకుంఠిత దీక్ష, పట్టుదలకు పొట్టి శ్రీరాములు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని కోరారు. జెడ్పీలోని వివిధ విభాగాల పరిపాలనాధికారులు మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, నాగేంద్రప్రసాద్, ఎస్.నాగరాజుతో పాటు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

➤ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి డీపీఓ జి.భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయ ఏఓ ప్రతిమ, ఉద్యోగులు మరళీ తదితరులు పాల్గొన్నారు.

➤ కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేనేజర్ చిన్నరాముడు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మీ, సర్వేయర్ విజయకుమార్ పాల్గొన్నారు.

➤ స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ నారాయణ, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

➤ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్టేడియం శిక్షకులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ వర్ధంతులను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ నేతృత్వంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు.

నాయకులు బజారన్న, స్వతనారాయణగుప్తా, షేక్ ఖాజా హుస్సేన్, ప్రమీళ, మహేంద్రనాయుడు, సాంబశివుడు పాల్గొన్నారు.


కర్నూలు కల్చరల్: పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకొని ఓల్డ్‌సిటీలోని పూలబజార్‌లో ఆయన విగ్రహానికి రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ పరమేష్, నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య, మహేష్, వాయుగండ్ల సుబ్బారావు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

➤ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు న్యూసిటీ : స్థానిక విద్యుత్ భవన్‌లో పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి, ఎస్ఏఓ రాఘవులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఓబులేసు, అధికారులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కండి

కర్నూలు(సెంట్రల్): మెరుగైన వైద్యం, ఉపాధి హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ నగర మహాసభలు జరిగాయి. ముందుగా మహాసభల ప్రారంభానికి సూచికగా ఏఐవైఎఫ్ జెండాను ఆయన ఆవిష్కరించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలపై మాట తప్పుతున్నాయన్నారు. కేంద్రం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేయగా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేస్తోందన్నారు. ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నెలకు ఒక్కో నిరుద్యోగికి రూ.3 వేల భృతి ఇస్తామన్న చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, కారుమంచి మాట్లాడుతూ..45 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు డీఎస్సీ ఫైలుపై చేసిన మొదటి సంతకానికే దిక్కులేకుండా చేశారన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి బీసన్న, ఏయూటీసీ నగర కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి తదితరులు